పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం



అలంపూర్‌లో కార్మికులకు పీపీఈ కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: మున్సిపాలిటీలో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా సామగ్రి భద్రత, యంత్రాల వినియోగంపై శనివారం కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్మికులకు పీపీఈ కిట్లు అందజేశారు. అనంతరం సాంఘీక సంక్షేమ పథకాల అనుసంధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ప్రతి సంవత్సరం బీమాను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు నితీష్, నరసింహ, షేక్షావలి, వెంకట్రాములు, ఆంజనేయులు, రామకృష్ణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

అయిజ: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రేణుక, మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



అయిజలో..



శాంతినగర్‌లో..

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

శాంతినగర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని రవీంద్ర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సిబ్బంది బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ వెంకట్, కృష్ణవర్ధన్‌నాయుడు, నరేంద్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య పెంచాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలో వార్డుల సంఖ్యను పెంచాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి మాట్లాడుతూ పెరిగిన జనాభా దృష్ట్యా అయిజ పురపాలక సంఘం పరిధిలో ఉన్న 20 వార్డులను 30 వార్డులుగా పెంచేందుకు పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో ప్రత్యేక తీర్మానం చేయాలని కోరారు. అయిజ గ్రామ పంచాయతీని రాష్ట్ర ప్రభుత్వం 2012లో 20 వార్డులతో కూడిన నగర పంచాయతీగా.. 2018లో మున్సిపాలిటీగా మార్చారు. 2012 నుంచి 2024 వరకు జనాభా పెరిగినప్పటికీ వార్డుల సంఖ్యను ఏమాత్రం పెంచలేదని వాపోయారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల నాటికి వార్డుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ ఆచారి, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



గట్టు: ఇందువాసి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేయనున్న రేచల్ టీచర్‌ను శనివారం చాగదోనలో ఘనంగా సన్మానించారు. చాగదోన ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన టీచర్ రేచల్ దంపతులను మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, ఎంఈఓ నల్లారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, చాగదోన గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రిటైర్డ్ ఎంఈఓలు కొండారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, మేరమ్మ, చాగదోన జీహెచ్‌ఎం మోహన్‌రెడ్డి, మాచర్ల జీహెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఇందువాసి హెచ్‌ఎం నర్సింహులు, నడిగడ్డ సోషల్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



గట్టు: మండలంలోని చాగదోన ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంఈఓ నల్లారెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పక పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికా ప్రకారం చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు మోహన్‌రెడ్డి, అయ్యస్వామి, ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య సీసీ రామకృష్ణ, గ్రామస్తులు నర్సింహులు, శేషన్న, వీరన్న పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



గట్టు: స్థానిక కస్తూర్బా కళాశాలలో విద్యార్థినులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటర్మీడియట్‌తో పాటుగా పాఠశాల విద్యార్థినులు 380 మందికి కంటి పరీక్షలతో పాటుగా సాధారణ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గుంటి గోపిలత, వైద్యాధికారులు జయరాజు, అమూల్య, అప్తాలమిస్ట్ రాంబాబు, ఏఎన్‌ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గట్టులో దివ్యాంగుల శిబిరం



గట్టు: స్థానిక రైతువేదికలో దివ్యాంగులకు వివిధ రకాల సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాన్ని శనివారం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక ప్రారంభించారు. దివ్యాంగులకు ఉపయోగపడే పరికాలను ఉచితంగా అందించేందుకు ఆలింకో స్వచ్ఛంద డాక్టర్ల బృందం ముందుకు వచ్చింది. దివ్యాంగ లబ్ధిదారులను ఎంపిక చేసి, జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దివ్యాంగుల శిబిరంలో 80 శాతం వైకల్యం ఉన్న వారు 25 మంది, 40 శాతం వైకల్యం ఉన్న వారు 160 మంది మొత్తం 200 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌చార్జ్ సీడీపీఓ నాగరాణి, తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ చెన్నయ్య, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, వాసంతి, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



అలంపూర్: రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం వెంకటరంగయ్య అనారోగ్యంతో బెంగుళూరులో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందారని ఎంఈఓ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన పార్థివదేహాన్ని బెంగుళూరు నుంచి కర్నూల్‌కు రాత్రి తీసుకొస్తారని, ఆదివారం కర్నూల్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిపారు. వెంకటరంగయ్య రాజోళి, పుల్లూరు, ఉండవెల్లిలో పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసినట్లు పేర్కొన్నారు. 2015లో జీహెచ్‌ఎంగా పదోన్నతి పొంది అలంపూర్ న్యూప్లాట్స్ జెడ్పీహెచ్‌ఎస్, లింగనవాయి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పని చేసి.. ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ పొందారు. రిటైర్డ్ హెచ్‌ఎం మృతిపై ఎంఈఓ, ఉపాధ్యాయులు బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో ఈనెల 29, 30వ తేదీల్లో నిర్వహించే ఐద్వా సంఘం జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని శనివారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్మద కోరారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాయకులు, గ్రామ ప్రతినిధులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓటరు తుది జాబితా విడుదల



అయిజ: మండలంలోని మొత్తం 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు తుది జాబితాను శనివారం ఎంపీడీఓ వెంకటయ్య విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు, బీఎల్‌ఓలు ఓటరు జాబితాను ప్రదర్శించారు

బాల సభ



ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో శనివారం బాల సభ కార్యక్రమాన్ని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి 20 ఎక్కాల వరకు అనర్గళంగా తెలుగు పద్యాలు, గేయాలు పాడే విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు.

బీజేపీ బలోపేతానికి కృషి



అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో బీజేపీ నాయకులు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గుర్తించి ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజేష్ గౌడ్, నర్సన్నగౌడ్, శశి, రమేష్, నాగేష్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు

గద్వాల క్రైం: వివిధ ప్రాంతాలకు పార్శిల్ పంపించేందుకు సర్వీసులు గద్వాల ఆర్టీసీ ఆధ్వర్యంలో బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు లాజిస్టిక్స్ ఇన్‌చార్జ్ ఇసాక్ బిన్ మహమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ లాజిస్టిక్స్ గద్వాల డిపో నుంచి గద్వాల, మల్దకల్, అయిజ, శాంతినగర్, రాజోలి, అలంపూర్ ఎక్స్‌రోడ్డు, కర్నూల్, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆదోనిలో బుకింగ్ కౌటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

'దళితబంధు పేరుతో దండుకున్నారు'



మాట్లాడుతున్న మద్దిలేటి

అయిజ: బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గతంలో దళితబంధు ఇప్పిస్తామని చెప్పి అర్హులు ఒక్కొక్కరితో రూ.లక్షలు దండుకున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో దళితబంధు ఇప్పిస్తామని అమాయకులను నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ. 2 నుంచి 3 లక్షల వరకు తీసుకొని, వారికి దళితబంధు ఇప్పించకుండా మోసం చేశారని మండిపడ్డారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాణమ్మ, కాంగ్రెస్ నాయకులు మైనర్ బాబు, దేవేంద్ర, దేవరాజు, మల్లికార్జున్, మునిస్వామి, మల్దకల్, చిన్నబాబు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



వడ్డేపల్లిలో పోస్టర్లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరించడం తగదని, విద్యార్థులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని శనివారం విద్యార్థులతో కలిసి జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు నుంచి క్రిష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షుడు చందు, రాజు, రవి, చరణ్ తదితరులు ఉన్నారు.

శాంతినగర్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేద్దామని ఆసంఘం నాయకులు కోరారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ బోధిని కళాశాలలో స్వర్ణోత్సవ సభ పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా జిల్లా పీడీఎస్‌యూ అధ్యక్షుడు హలీంపాషా మాట్లాడుతూ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో అక్టోబర్ 24న జరిగే సభకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, రాజు, మహేష్, భాస్కర్, చంద్రశేఖర్, శివరాజు, జగదీష్, అనిల్, చరణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాల పెంపు



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్: గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడుగుంతను తప్పనిసరిగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని తాటికుంటను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపై ప్రవహించకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. గ్రామ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఉద్యానవన శాఖ ద్వారా సాగుచేసిన పండ్ల తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ప్రమీల, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో అమరవాయి విద్యార్థి ప్రతిభ



శిరీషకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

మల్దకల్: గద్వాల పట్టణంలో ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన 27వ జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌మేళాలో అమరవాయి విద్యార్థి శిరీష సైన్స్‌మేళాలో మొదటిస్థానంలో నిలిచినట్లు జీహెచ్‌ఎం నరేష్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన శిరీషను సైన్స్ ఉపాధ్యాయులు అచ్యుతుడు, రుషిరాజు అభినందించారు. అలాగే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కళాందర్ బాషా, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్, పాపన్న ప్రతిభ చాటిన విద్యార్థికి జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లాస్థాయిలో అమరవాయి విద్యార్థి ప్రతిభ చాటడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



జూలెకల్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు



అలంపూర్‌లో..

అలంపూర్: మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేద్దామని సమ సమాజ సేవా ట్రస్టు సభ్యులు పిలుపునిచ్చారు. గుర్రం జాషువా, భగత్ సింగ్‌ల జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమ సమాజ ట్రస్టు సభ్యులు నందు, రాజు, నరసింహ్మ, నాగరాజు, అయ్యప్ప, మౌలాలి, అశన్న, బాబు, జయన్న, మద్దిలేటి ఉన్నారు.

ఘనంగా నివాళి

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను భగత్‌సింగ్ చిత్రపటంపై ఉంచి జేజేలు పలికారు.

గద్వాల రూరల్: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం గద్వాల మండలంలోని అనంతపురంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, ఖాజా, నాగరాజు, వెంకటన్న, బాలయ్య తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జూన్‌లో చేపట్టిన టీజీఏఐఎంఎస్ సర్వేలో శిథిలావస్థకు చేరిన స్తంభాలు మార్చడం, చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ, మోమిన్ మహెల్లా, రాయిచూర్ రోడ్డు, వడ్ల వీధి, చాపల మార్కెట్, బీసీ కాలనీ, కొత్తపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా ధరూరులో 33కేవీ నర్సన్‌దొడ్డి ఫీడర్‌లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు ధరూరు, జాంపల్లి, దోర్నాల, బూరెడ్డిపల్లి, పార్చర్ల, మన్నాపురం, రేవులపల్లి, చింతరేవుల గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

సమయపాలన పాటించాలి

గట్టు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ నల్లారెడ్డి సూచించారు. శనివారం మాచర్ల, చాగదోన పాఠశాలలను ఎంఈఓ నల్లారెడ్డి తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తరగతి గదుల్లో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, వారు పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం కార్యాలయంలో శనివారం పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించామని ఇన్‌చార్జ్ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు తెలిపారు. ఈ సమావేశంలో బహిరంగ వేలం ద్వారా భూమిని కొన్న రైతు సాయిబాబా ఒకసారి పత్తిని సాగుచేయగా.. రూ. 1.40లక్షలు, రెండోసారి ఉల్లి రూ.70వేలు, జనుముకు రూ. 50వేలు ఖర్చు వచ్చిందని మొత్తం రూ. 2.60వేల ఖర్చు అయిందని తెలిపారు. సహకార సంఘానికి అప్పు ఉన్నా రైతు భూమిని దున్నుతున్నాడని సభకు వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ విజయ్, స్టాఫ్ అసిస్టెంట్ చారి, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రాకెట్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన

వనపర్తి రూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి విభిన్న అంశాలపై అవగాహనను ఏర్పర్చుకోవాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) రిటైర్డ్ ఇంజినీర్ డాక్టర్ తెలగమల్ల రఘువర్మ పేర్కొన్నారు. ఆయన శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్పేస్, ఇంజినీరింగ్, ఎరోనాటికల్ ఇంజినీరింగ్ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రఘువర్మ రాకెట్, ఉపగ్రహాలను కక్షలోకి పంపించే విధానాలలో ఉపయోగించే గణిత ఫార్ములాను, అక్షాంశ, రేఖాంశాలను వినియోగించే అంశాలను స్మార్టు బోర్డు ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత రఘువర్మను హెచ్‌ఎం నాగేందర్ ఉపాధ్యాయులతో కలిసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ హనుమంతు, ఉపాధ్యాయులు కవిరాజ్‌గౌడ్, ఎల్లస్వామి, కురుమయ్య, మేఘారెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాలి



అలంపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వెంకటస్వామిని టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు. టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు ప్రేమదాసు, మండల అధ్యక్షుడు ఎల్లన్న, నాయకులు జయన్న, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం నరేష్ తెలిపారు. గద్వాల పట్టణంలో జరిగిన జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలో అండర్–17 బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థి అశోక్, బాలికల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని ఉరుకుందమ్మ విజేతలుగా నిలిచారు. వారు మెదక్, భద్రాచలంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రాజోళి: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్ కోరారు. రాజోళికి నూతన తహసీల్దార్‌గా వచ్చిన పి.రామ్మోహన్‌ను ఆయన శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత శాలువా, పూలమాలతో సన్మానించారు. చేనేత కార్మికులు పలు సమస్యలపై కార్యాలయానికి వస్తుంటారని, వారి పనులు ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల ప్రతిభ



అయిజ: జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో అయిజ మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం అలంపూర్ నియోజకవర్గంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి అండర్ 14, 17 బాలుర విభాగాలకు పోటీలు నిర్వహించారు. అండర్ 17 విభాగంలో అయిజ మండలంలోని విద్యార్థులు మొదటి బహుమతిని కై వసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బషీర్, సతీష్, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బన్న, రఘు, ధర్మతేజ పాల్గొన్నారు.